

రామనగర పేరు మార్పునకు కేంద్రం ససేమిరా..!

డీసీఎం ఆశలపై నీళ్లు

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రామనగర జిల్లాను బెంగళూరు దక్షిణగా మార్చు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి కేంద్రం షాక్ ఇచ్చింది. జిల్లా పేరు మార్చే ప్రస్తావనను తిరస్కరించింది. డీసీఎం డీకే శివకుమార్ పెట్టుకున్న ఆశలకు చుక్కెదురైంది. రామనగరను బెంగళూరు దక్షిణ జిల్లాగా మార్పు చేయాలని డీసీఎం భావించారు. కేబినెట్‌లో తీర్మానించి కేంద్రప్రభుత్వానికి ప్రస్తావనలు పంపారు. రామనగరను పేరు మార్చడాన్ని కేంద్రమంత్రి కుమారస్వామి తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖకు రెండు నెలలక్రితం రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏ ప్రాతిపదకన తిరస్కరించారనేది కేంద్రం స్పష్టం చేయలేదు. కానీ జిల్లా పేరు మార్పును స్థానికులు వ్యతిరేకిస్తున్నారని ఓ కారణం చూపింది. గత ఏడాది రామనగర జిల్లా చన్నపట్టణ నియోజకవర్గానికి ఉప ఎన్నికలను డీసీఎం డీకే శివకుమార్ ప్రతిష్టాత్మకంగా భావించారు. ఇదే జిల్లా కనకపుర ఆయన సొంత నియోజకవర్గం కావడంతో తరచూ పర్యటనలో భూములు అమ్ముకోరాదని, భవిష్యత్తు ఉందని పలుమార్లు సూచించారు. చన్నపట్టణ ఎన్నికల వేళ జిల్లా పేరు మార్పు జరుగుతుందని, బెంగళూరుకు అనుబంధం కానుందని ప్రచారం చేశారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడ్డానని చెప్పుకొచ్చారు. అయితే కేంద్రప్రభుత్వం జిల్లా పేరు మార్పునకు ససేమిరా అనడంతో ఆయన ఆశలు ఫలించలేదు.

మద్యంప్రియులకు రెండు బాటిళ్లు ఉచితంగా ఇవ్వండి

శాసనసభలో జేడీఎస్ ఎమ్మెల్యే కృష్ణప్ప డిమాండ్



సభలో జేడీఎస్ ఎమ్మెల్యే ఎంటీ కృష్ణప్ప

బెంగళూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మద్యంప్రియులకు వారానికి రెండు బాటిళ్లు ఉచితంగా ఇవ్వాలని శాసనసభలో తురువేకెరె నియోజకవర్గ జేడీఎస్ ఎమ్మెల్యే ఎంటీ కృష్ణప్ప డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా సభ్యుడు మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అబ్కారీ ఆదాయం రూ.40వేల కోట్లకు పెంచుకున్నారన్నారు. త్వరలోనే మద్యం ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. గత ఏడాది ప్రభుత్వం ఏకంగా మూడుసార్లు మద్యం ధరలు పెంచిందన్నారు. ఇది పేదలపై తీవ్ర ప్రభావం చూపదా అని ప్రశ్నించారు. కార్మికవర్గాల సంపాదనలో ఎక్కువమొత్తం మద్యానికే ఖర్చు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. వారిని మద్యం నుంచి దూరం చేయలేమన్నారు. ఇలా ఏటా టార్గెట్‌లు పెంచుకుంటూ ధరలు పెంచితే సామాన్యుల పరిస్థితి ఏం కావాలన్నారు. గ్యారెంటీల పేరిట మహిళలకు శక్తి గ్యారెంటీ, ఉచిత విద్యుత్, గృహలక్ష్మి వంటి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కనీసం మద్యం బాబులకు వారానికి రెండు బాటిళ్లను ఉచితంగా ఇవ్వాలన్నారు. ప్రభుత్వం మద్యం విక్రయాలను సొసైటీల ద్వారా అమలు చేయాలని సలహా ఇచ్చారు. అయితే పలువురు సభ్యులు మద్యనిషేధం తీసుకురావాలని డిమాండ్ చేశారు.



రారండోయ్.. భక్తులారా..!

నేడు ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం

కదిరి మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవానికి భక్తులు సిద్ధమయ్యారు. ఫాల్గుణ మాసం, అనూరాధ నక్షత్రం, మేష లగ్న శుభపుష్కరాంశంలో, గురువారం ఉదయం 7.45 గంటల నుంచి 8.20 గంటల మధ్య రథాన్ని కదిలించేలా ఆలయ వేద పండితులు ముహూర్తం ఖరారు చేశారు.

బిచ్చగాళ్లకు... ఆశ్రయం..!

- ఒకప్పుడు యాచకులు... నేడు పంటలసాగుతో జీవనం
- ఆదర్శంగా నిలుస్తున్న తుర్చఘట్ట ఆశ్రయకేంద్రం



పునరావాస కేంద్రంలోని కొందరు ఇలా...

బెంగళూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్, బస్టాండ్‌తో పాటు పలు కూడళ్లలో బిచ్చమెత్తి కడుపు నింపుకొనేవారంతా ఆశ్రయకేంద్రానికి వెళ్లి అక్కడే కొంత కాలం గడిపి పంటలసాగుతో జీవనం సాగిస్తున్నారు. అటువంటి అరుదైన జీవన విధానం దావణగెరెలో జరిగింది. రోజూ పొద్దున్నే లేస్తే చాలు... భుజాన సంచి వేసుకుని బిచ్చమెత్తుకునేందుకు వెళ్లేవారు. మరికొందరు బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, దుకాణల వెంబడి తిరుగుతూ చిల్లర సేకరించి వచ్చే సొమ్ముతో కడుపు నింపుకొనేవారు. దావణగెరె సమీపంలోని తుర్చఘట్ట గ్రామంలో సాంఘికసంక్షేమశాఖ ద్వారా నిర్వహిస్తున్న ఆశ్రయ కేంద్రం ఇలాంటి ఎంతోమందికి దారిదీపమైంది. ఆశ్రయకేంద్రంలో 147మంది ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తూ రైతులమని ఆత్మస్థైర్యంతో చెప్పుకొంటున్నారు.

వివిధ రాష్ట్రాల వారికి ఆశ్రయం

దావణగెరె తాలూకా తుర్చఘట్ట - బుళ్ళాపుర గ్రామాల మధ్య పది ఎకరాల విస్తీర్ణంలో ఆశ్రయకేంద్రం ఉంది. ఇక్కడ ఆశ్రయం పొందుతున్నవారంతా చేతనైనంత పనిచేస్తారు. నాలుగేళ్లుగా పంటలసాగు, పాడి ఆవుల పెంపకాన్ని కొనసాగిస్తున్నారు. ఇక్కడ ఆశ్రయం పొందుతున్నవారిలో కన్నడిగులే కాకుండా తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బిహార్, కేరళ, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, పంజాబ్‌లకు చెందినవారు ఉన్నారు. వీరిలో పలువురికి పంటసాగు చేసే అనుభవం కూడా ఉంది.



దావణగెరెలోని బిచ్చగాళ్ల పునరావాస కేంద్రం

- ఆశ్రయకేంద్రంలో 147మంది ఉన్నారు. వీరందరినీ ఆశ్రయ కేంద్రం నిర్వాహకులు రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లలో బిచ్చమెత్తుకుంటూ లేక ఇతరప్రాంతాలనుంచి తప్పించుకుని వచ్చినవారు ఉంటారు. ఇలాంటి వారిని చేరదీసి రెండేళ్ల పాటు ఆశ్రయకేంద్రంలో ఉంచుకుంటారు. వారికి మూడుపూటలా ఆహారం, వసతి సౌకర్యం కల్పిస్తారు. వారికి యోగాసనం, ఆరోగ్య పరీక్షలు జరిపిస్తారు. వివిధ వృత్తులలో శిక్షణ ఇస్తారు. ఫినాయిల్ తయారీ, శౌచాలయం శుభ్రం చేసే యాసిడ్, పాడి ఆవుల పెంపకంతోపాటు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారు.

పనిచేసేవారికి కూలి సొమ్ము..

ఆశ్రయం పొందేవారికి అనువైన పని కల్పిస్తారు. చేతనైనంత పని చేయాల్సి ఉంటుంది. ఇలా తోటల పని, కూరగాయల పెంపకంలో పని చేసేవారికి రోజుకు 80 రూపాయలను కూలి రూపంలో ఇస్తారు. సదరు సొమ్మును వారి ఖాతాలకు జమ చేస్తారు. ఆశ్రయకేంద్రం వదిలి వెళ్లే సమయంలో ఆర్టీజీఎస్ ద్వారా సొమ్మును వారి ఖాతాకు బదిలీ చేస్తారు. సొంతంగా వ్యాపారం, ఇతరత్రా పనిచేసుకునేందుకు వెసులుబాటు కల్పించినట్టు అవుతుంది. అనాథలుగా ఉండేవారితో పాటు కుటుంబీకులతో కలసి ఉండలేమనేవారికి ఆశ్రయం కల్పిస్తారు. మళ్లీ ఇళ్లకు వెళ్లదలచుకుంటే వారికి ఏ విధమైన సొమ్ము రావాలో లెక్కించి పంపిస్తారు.

50ఏళ్లు పైబడినవారే ఎక్కువ..

ఆశ్రయ కేంద్రంలో సేద తీరుతున్నవారిలో ఎక్కువమంది 50ఏళ్లు పైబడినవారే ఉన్నారు. దాదాపు 120మంది 50-60ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారు ఉన్నారు. వారు కష్టపడి పొలంలో పనిచేయడమే ప్రత్యేకం అనిపిస్తుంది. 2025 ఫిబ్రవరి నాటికి సుమారు 1,500 మందిని ఆశ్రయకేంద్రంలో ఉంచుకుని, వారిలో 200 మంది చిరునామాలు గుర్తించి సొంతూళ్లకు పంపారు. పంజాబ్, హరియాణ, బిహార్ రాష్ట్రాలకు చెందినవారే ఎక్కువమందిని తిరిగి పంపించారు. ఇక్కడ ఆశ్రయం పొందినవారికి పరివర్తన కలిగేలాంటి పనులు వారు ఇష్టపడేలాంటి పనులు, అనుభవ పనులకు అవకాశం ఇస్తారు. రెండు ఎకరాల భూమిలో కూరగాయలు సాగు చేస్తున్నారు. టమోటా, వంకాయ, పచ్చిమిరప, ముల్లంగి, మునగకాయలు సాగు చేస్తారు. వీటిని రోజూ వంటలకు ఉపయోగిస్తారు. 16 పాడి ఆవులను పోషిస్తున్నారు. వాటి ద్వారా వచ్చే పాలను ఉపయోగిస్తారు.

రాష్ట్రంలో భిక్షాటన నిషేధ చట్టం

రాష్ట్రంలో భిక్షాటన నిషేధచట్టం అమలులోకి తెచ్చారు. 14 జిల్లాల్లో ఇటువంటి ఆశ్రయ పునరావాస కేంద్రాలు తెరిచారు. బెంగళూరు, బళ్ళారి, బెళగావి, ఉజిరె, చిత్రదుర్గ, కలబురగి, హుబ్బళ్ళి-ధారవాడ, కోలారు, మైసూరు, మంగళూరు, రాయచూరు, శివమొగ్గ, తుమకూరు, దావణగెరెలలో ఉన్నాయి.

- ప్రతి కేంద్రంలోనూ 100-150మంది దాకా సేద తీరుతున్నారు. రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లు, కూడళ్లు, పార్కులు, ట్రాఫిక్ సిగ్నల్స్‌లో బిచ్చమెత్తేవారిని అదుపులోకి తీసుకుని ఇటువంటి కేంద్రాలలో ఆశ్రయం కల్పిస్తున్నారు. వారికి వృత్తిజీవనంలో ఆసక్తి ఉన్న విభాగాలలో నైపుణ్యం కల్పిస్తారు. ఇలాంటిదే తుర్చఘట్టలోని ఆశ్రయకేంద్రం కూడా. మిగిలిన కేంద్రాలతో పోలిస్తే తుర్చఘట్టకేంద్రం ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ఆశ్రయకేంద్రం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ కాశీనాథ్ అభిప్రాయం మేరకు తమవద్ద 147మంది రక్షణ పొందుతున్నారని, వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

సంతోషంగా ఉన్నా: సతీశ్ పాటిల్

ఆశ్రయకేంద్రంలో నేను ఎంతో సంతోషంగా ఉన్నా. మానసిక సమస్యలతో ఇబ్బందిపడేవారు ఇక్కడికి వస్తుంటారు. భోజనంతోపాటు వైద్య చికిత్సలు వ్యవస్థీకృతంగా అమలు చేస్తున్నారు. అన్నింటికంటే ఇక్కడ పనిచేసేవారు మానవత్వంతో ఆదరిస్తారు.



తోట పనులు చేస్తున్న బిచ్చగాళ్లు



గుంతలో ఇనుపదిమ్మె అమరిక ఇలా..

ఆదమరిస్తే అంతే..!

ఇది అత్యంత రద్దీగా ఉండే రోడ్డు. ముఖ్యమంత్రి అధికారిక నివాస కార్యాలయంతోపాటు దేశ విదేశీయులు అధికార కార్యక్రమాలకు వస్తే బస చేసే కుమారకృప గెస్ట్ హౌస్‌కు వెళ్లే మార్గం. చిత్రకళా పరిషత్, గాంధీభవన్‌తోపాటు మంత్రుల క్వార్టర్స్‌కు అనుబంధంగా రేస్‌కోర్సు రోడ్డు నుంచి కుమారకృప వైపు వెళ్లే ప్రాంతమిది. 24గంటలపాటు వాహనాలు సంచరించే కుమారకృప రోడ్డు మధ్యనే ఓ పెద్దగుంత ఏర్పడింది. దాదాపు నెలరోజులుగా గుంత అలాగే ఉంది. వాహనదారుల అప్రమత్తం కోసం స్థానికులు ఓ పెద్ద ఇనుపదిమ్మెను గుంతకు అడ్డుగా పెట్టారు. ఇలా ప్రముఖుల సంచారంతోపాటు ఏకంగా రెండు స్టార్ హోటళ్లు ఉన్న మార్గంలో ప్రయాణించాలంటే అప్రమత్తంగా ఉండాలనే భయం అందరినీ వెంటాడుతోంది. ఈ గుంతను ఎప్పటికి పూడుస్తారో వేచి చూడాలి మరి. (ఆంధ్రజ్యోతి, బెంగళూరు)



దగ్ధమైన బస్సు

ఆర్టీసీ బస్సులో మంటలు

- త్రుటిలో తప్పించుకున్న ప్రయాణికులు

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీదర్ జిల్లా ఔరాద్కర్ తాలూకా కప్పకేరి వద్ద బుధవారం కల్యాణ కర్ణాటక ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. కొన్ని నిమిషాల వ్యవధిలోనే బస్సు పూర్తిగా కాలిపోయింది. ఔరాద్కర్ డిపోకు చెందిన బస్సు బీదర్ నుంచి వస్తుండగా కప్పకేరి వద్ద ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. అంతలోనే డ్రైవర్ అప్రమత్తమై బస్సును ఆపేశారు. ప్రయాణీకులందరినీ కిందకు దిగాలని సూచించారు. ఇంజన్‌లో చెలరేగిన మంటలు కొద్దిసమయంలోనే బస్సు పూర్తిగా వ్యాపించాయి. 25మంది ప్రయాణీకులు బస్సునుంచి కిందకు దిగి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. స్థానిక అగ్నిమాపక సిబ్బంది ఫైర్‌ఇంజన్‌లతో వచ్చి మంటలను పూర్తిగా నియంత్రించారు. అయితే బస్సు పూర్తిగా కాలిపోయింది.

రచ్చకెక్కిన దంపతుల వివాదం

- భార్య వేధిస్తోందని భర్త ఫిర్యాదు
- వారే ఇబ్బంది పెట్టారంటూ ఆమె వివరణ

బెంగళూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో భార్యల వేధింపుల వివాదాలు హల్‌చల్ చేస్తున్నాయి. బెంగళూరుకు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి భార్య వేధింపులు తట్టుకోలేకపోతున్నానని వయ్యాలికావల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. సంసారం చేసేందుకు రోజుకు రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, భార్య తరఫు బంధువులు ఇల్లు కొనాలని డబ్బు డిమాండ్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విడాకులు కోరితే రూ.45లక్షలు ఇవ్వాలని ప్రతిపాదన పెట్టారన్నారు. 2022లో పెళ్లి చేసుకున్నానని ఇప్పటివరకు సంసారం చేయలేదని, అందం పాడవుతుందని పిల్లలు వద్దని ఇబ్బంది పెడుతున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. సొంత పిల్లలు వద్దని, దత్తత తీసుకుందామని వేధిస్తోందన్నారు. సంసారానికి సిద్ధమైతే డెత్‌నోట్ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకుంటానని బెదరిస్తున్నట్టు ఫిర్యాదులో స్పష్టం చేశారు. వర్క్‌ఫ్రం హోం వేళ టీవీ సౌండ్ పెంచడం, డ్యాన్స్ చేసి ఇబ్బంది పెట్టేదని, వేధింపులు తట్టుకోలేక పోతున్నానని ఉపశమనం కలిగించాలని పోలీసుల ఎదుట వాపోయాడు.

అయితే భార్య కూడా పలు ఆరోపణలు చేశారు. రెండేళ్లక్రితం పెళ్లి చేసుకున్నామని, ఇంట్లో భర్తతోపాటు బంధువులు ఇబ్బంది పెట్టేవారన్నారు. సంసారానికి అభ్యంతరం చెప్పలేదని అన్నీ అబద్ధాల వీడియోలు విడుదల చేశారన్నారు. మా తండ్రి రూ.40లక్షలు ఇచ్చి పెళ్లి చేశారన్నారు. కనీసం భోజనం కూడా పెట్టడం లేదని, అందుకే తరచూ పుట్టింటికి వెళ్లి వస్తున్నట్టు తెలిపారు. తీరు మార్చుకుంటే కలసి ఉంటానని చెప్పానన్నారు. గతంలోనే వయ్యాలికావల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదన్నారు. వారికి ఖర్చు కాకూడదని ఇంటిల్లిపాదికి అరలీటరు పాలు మించరాదని, అన్నం విషయంలోనూ రాద్ధాంతం చేసేవారని ఓ ఫొటోను ఆమె విడుదల చేశారు. భార్యాభర్తల వివాదం రచ్చకెక్కింది.


రేపు శ్యాంకీ చెరువులో కావేరి హారతి

బెంగళూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కావేరి నదికి గౌరవం సమర్పించే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం వారణాసిలో జరిగే 'గంగా హారతి' తరహాలో బెంగళూరు నగరం శ్యాంకీ చెరువు ప్రాంగణంలో కావేరి హారతి ఆధ్యాత్మిక కార్యక్రమం జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈనెల 21న శుక్రవారం సాయంత్రం కార్యక్రమం జరగనుంది. వారణాసిలో గంగా హారతి జరిపే పురోహితులు కావేరి హారతిని అమలు చేయనున్నారు. ఇందుకోసం జలమండలి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు మంత్రులు జలమండలి అధికారులు కలసి కనీసం 10వేల మంది ప్రజలు భాగస్వాములు అవుతారని భావిస్తున్నారు. ఇందుకు జలమండలి ఏర్పాట్లు చేస్తోంది. బెంగళూరులో 70శాతం మంది కావేరి నీటిని వినియోగిస్తున్నారు. రోజూ 2.25 మిలియన్ లీటర్ల నీటిని సమకూరుస్తున్నారు. ఇందుకు ప్రభుత్వం కావేరి నదికి పూజలు జరపతలపెట్టింది. శ్యాంకీ చెరువును ఎంపిక చేసుకోవడం వెనుక ప్రధాన కారణం ఈ చెరువు కావేరి నదికి ఉపనదిగా ఉండే వృషభావతి జన్మించే స్థలమనే పేరుంది. అందుకోసమే శ్యాంకీ చెరువును ఎంపిక చేసుకున్నారు. చరిత్రకారులు బసవనగుడిలోని దొడ్డబసవణ్ణ ఆలయం నంది విగ్రహం పాదాల వద్ద నది ఉద్భవిస్తుందని చెబుతుండగా, కొందరు శ్యాంకీ చెరువుగా అభిప్రాయపడుతున్నారు. కావేరి హారతిలో పాల్గొనే వారికి కొడగు జిల్లా భాగమంగలలో ప్రవహిస్తున్న కావేరి నీటిని తీసుకొచ్చి తీర్థం రూపంలో ఇచ్చేందుకు జలమండలి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత శ్రీరంగపట్టణలో కావేరి హారతి జరపాలని భావించారు. అయితే బెంగళూరులో ప్రారంభించి అనంతరం శ్రీరంగపట్టణలో నిర్వహించాలని యోచిస్తున్నారు. నగరంలో గాలి ఆంజనేయస్వామి గుడి వద్ద పూజలు నిర్వహించి, అక్కడే హారతి జరపాలని భావించారు. కానీ తగిన స్థలం లేకపోవడం, ఎక్కువమంది ప్రజలు వచ్చేందుకు అవకాశం ఉండదని, పైగా రాజకాలువ ద్వారా దుర్గంధం వస్తుండడంతో ప్రజలు ఎక్కువ సమయం గడపలేరని శ్యాంకీ చెరువు ప్రాంగణానికి మార్పు చేశారు. కార్యక్రమంలో లేజర్ ప్రదర్శనలు, ఆర్కెస్ట్రాతోపాటు పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కావేరి హారతి నిర్వహించేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి నుంచి పలువురు అర్చకులను రప్పించారు.

పర్యావరణ నిపుణుల అభ్యంతరం

అయితే పర్యావరణ నిపుణులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఈ ప్రాంతంలో ఉన్న చెట్లు చెరువులోని పక్షులు, మత్స్య సంపద తదితర జలచరాలకు ఇబ్బంది కలుగనుందని అంటున్నారు. కావేరి హారతి నిర్వహించే విషయంలో పునరాలోచించాలని కోరారు. బీబీఎంపీ అధికారులకు వినతిపత్రాన్ని పంపారు. లేజర్ షో నిర్వహిస్తే చెట్లలోని పక్షులకు ఇబ్బంది కలుగుతుందన్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1598.07	1,582.46
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,200	765
నీటి నిల్వ (టీఎంసీలు)	19.13	5.78

దుకాణాలకు లైసెన్స్ ఇవ్వాలని వినతి



అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

బళ్లారిరూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏపీఎంసీలో రైతులకు మాత్రమే దుకాణాలు మంజూరు చేయాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం హసిరుసేన జిల్లా అధ్యక్షుడు సంగనకల్ కృష్ణమూర్తి బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. ఏపీఎంసీ మార్కెట్లో 300 నుంచి 400 వరకు దుకాణాలు ఉన్న నేపథ్యంలో సరుకు రవాణా ఇటు కర్ణాటక రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి రైతులు మార్కెట్ వస్తారన్నారు. మార్కెట్ యార్డులో మార్కెట్ కోసం అన్ని దుకాణాలు బాడుగకు తీసుకుని మరో బిజినెస్, కూల్ డ్రింక్ షాపు ఇతర షాపులు నిర్వహిస్తునానరన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తాలుకా అధ్యక్షుడు మర్రిస్వామి, కొలగల్లు తిమ్మప్ప, గాదిలింగ బసవరాజు, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత చెవి పరీక్షలు



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యుడు

బళ్లారిరూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో సరళా దేవి సతీష్ అగర్వాల్ కళాశాల ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చెవి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలను డాక్టర్ ఎస్ మహిపాల్ రోగులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎం యోషకీ, దేవన్న, రెడ్ క్రాస్ ఆర్గనైజర్ భజరంగ శర్మ, వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటవీశాఖలో సిబ్బంది కొరత



సండూరులోని అటవీశాఖ కార్యాలయం

తోరణగల్లు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తర వలయ అటవీశాఖలో సిబ్బంది కొరత ఉందని ఆశాఖ అధికారి మంజునాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేసవి అడవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఉన్నామని, రక్షక సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారన్నారు. అలాగే వన్యప్రాణులకు నీటికొరత లేకుండా తొట్టిలు ఏర్పాటు చేశామన్నారు. అటవీ మార్గాలలో అగ్ని వల్ల జరిగే ప్రమాదాలను గుర్తించి సర్వజనులు తమకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ముఖ్యంగా సిబ్బంది కొరత వుందని రామ్‌గిడా బ్లాక్ నార్త్ ఈస్ట్ బ్లాక్ ప్రాంతాలలో అరణ్య రక్షకులు పది మంది కావలసి వుండగా ఇద్దరు మాత్రమే ఉన్నారన్నారు. అలాగే అటవీ వీక్షకులు ఆరుగురు కావల్సి ఉండగా, ఇద్దరు మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలని ఆయన కోరారు.

20 వరకు నీటిని విడుదల చేయండి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బీవీ గౌడ



చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కంప్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం కింద ఎల్ఎల్‌సీ కాలువకు ఏప్రిల్ 20 వరకు నీటిని విడుదల చేయాలని కర్ణాటక రైతు సంఘం హసురుసేన, బళ్లారి జిల్లా అధ్యక్షులు బీవీగౌడ కోరారు. బుధవారం మునిరాబాద్ చిన్న నీటిపారుదల కార్యాలయం చీఫ్ ఇంజనీర్ బసవరాజుకు రైతులతో కలిసి ఆయన మనవిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఐసీసీ సమావేశంలో మార్చి 31కు నీటిని బంద్ చేయాలని తీర్మానం చేశారన్నారు. ఇలా చేస్తే వేల కోట్లు రూపాయల్లో రైతులు నష్టపోతారని అన్నారు. ప్రతి యేటా వేసవిలో రైతులకు ఇదే అంశంపై సమస్య వస్తోందన్నారు. వేసవిలో నాట్లు ప్రారంభం నుంచి పంటలు తీసుకునే వరకు ప్రజాప్రతినిధులు అధికారులు (ఐసీసీ)సమావేశంలో తీర్మానం తీసుకుంటే ఈ పరిస్థితి తలెత్తదన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైతులకు జీవనాడి అయిన తుంగభద్ర జలాశయం ప్రతిరాష్ట్రంలోని రైతులను అనుసరించుకొని వేసుకున్న పంటలకు తగ్గట్టుగా తీర్మానం తీసుకున్నట్లయితే అన్ని రాష్ట్రాల రైతులకు అనువుగా ఉంటుందన్నారు. ఏప్రిల్ 20 వరకు నీరు ఏదోవిధంగా కాలువకు విడుదల చేసి పంటలను ఆదుకోవాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు బరమారెడ్డి, కంప్లి తాలుకా అధ్యక్షుడు వీరేష్, నగర ఘటక అధ్యక్షుడు శివప్పనాయక, కొట్టూరు రమేష్, మురారి, సుదర్శన్, సదాశివప్ప, సుగురప్ప, జడియప్ప, లింగప్ప, గాదిలింగప్ప, గుండప్ప, శివప్ప పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

బళ్లారి సిటీ,మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు రూ.10వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఆశా వర్కర్స్ అసోసియేషన్ బళ్లారి జిల్లా యూనిట్ బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టింది. నగరంలోని గాంధీ భవన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఆశావర్కర్లకు ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని వారు కోరారు. ఏఐయూటీయూసీ జిల్లాకార్యదర్శి ప్రమోద్ మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి ఆశా కార్యకర్తలకు ప్రతినెలా ప్రోత్సాహకాలతో పాటు కనీసం రూ. 10వేలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. దీంతో పాటు అదనపు ప్రోత్సకాలు కూడా ఇవ్వాలని కోరారు. వాగ్ధానాలు చేసిన ప్రభుత్వం వాటిని అమలు చేయడానికి మీనమేషాలు లెక్కించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సంఘం గౌరవ అధ్యక్షురాలు శాంత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో జిల్లా యూనిట్ అధ్యక్షులు గీత, రాజేశ్వరి, అంబిక, జలజాక్షి, ఈరమ్మ, సుజాత, మహాలక్ష్మి, చంద్రలేఖ, హనుమంతమ్మ, శాంతమ్మ, అమృత పాల్గొన్నారు.

పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంచుకోండి



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న పంచాయతీ అధ్యక్షురాలు బసమ్మ

కంప్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): యువతీ యువకులు, పుస్తకాలు, పత్రికలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కుడితిని పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు బసమ్మ చంద్రప్ప సూచించారు. బుధవారం జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో నూతన గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించారు. 2023-24 సంవత్సరానికి ఎన్ఎండీసీ నిధులు రూ.20 లక్షల వ్యయంతో నూతన గ్రంథాలయాన్ని నిర్మించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు పుస్తకాలు, దినపత్రికలు చదివే అలవాటును పెంచుకోవాలని సూచించారు. ఇక్కడ లభించిన సమాచారం అమూల్యమైనదన్నారు. యువతతోపాటు ప్రజలు నిత్యం గ్రంథాలయానికి వెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ ఉపాధ్యక్షులు కనికేర పంపాపతి సభ్యులు రామలింగప్ప, హాలప్ప, లెనిన్, సునిల్ కుమార్, శంకరమ్మ, రత్నమ్మ, ముఖ్య అధికారి తీర్థప్రసాద్, బళ్లారి నిర్మాణ కేంద్రం ప్లానింగ్ ఇంజనీర్ వీరేష్, లైబ్రేరియన్ హనుమప్ప, బాలాజీ ఆచారి పాల్గొన్నారు.

బాలలకు పుస్తకాలు, ఆహార కిట్ల అందజేత



పుస్తకాలు, కిట్లు అందజేస్తున్న అధికారులు

రాయచూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వృత్తి నుంచి విముక్తి పొందిన ఎస్సీఎస్టీ బాలలకు బుధవారం బాలకార్మిక నిర్మూలన పథకం డైరెక్టర్ మంజునాథ రెడ్డి పుస్తకాలు, ఆహార ధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. 2024-25వ ఆర్థిక సంవత్సరంలో కార్మికలుగా పనిచేస్తున్న బాలలను విముక్తి చేసిన అధికారులు వారిని ప్రత్యేక వసతి గృహాల్లో ఉంచి పాఠశాలల్లో చేర్పించారు. ఇందుకోసం ఎస్సీఎస్టీ ప్రత్యేక నిధుల ద్వారా పుస్తకాలు, ఆహార ధాన్యాల కిట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా బాలలను విధిగా పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్య ద్వారానే పురోగతి సాధ్యమని పిల్లలను పనికి పంపడం చట్టరీత్యా నేరమని ఆయన అన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి: తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

బళ్లారి సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కార్మికులందరూ తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సండూరు తహసీల్దార్ అనిల్‌కుమార్ కోరారు. 18సంవత్సరాల వయస్సు వరకు వారి విద్యను కొనసాగించేలా చూసుకోవాలన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లాపరిపాలన, పంచాయతీ, కార్మిక శాఖ, బాలకార్మిక పథకం సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ ఉప ప్రాజెక్టు కింద బాల కార్మికుల నిర్మూలనపై సండూర్‌లోని కుమారస్వామ భవన నిర్మాణ కార్మికుల కార్యాలయ హాల్లో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు చదవుకునే సమయంలో వారిని పాఠశాల నుంచి పనికి పంపించరాదన్నారు. ఇలాంటి సంఘటనలు గుర్తిస్తే పిల్లల తల్లిదండ్రులు, యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్మిక శాఖ ప్రయోజనాలను పొందాలంటే అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆ శాఖ ఆదేశాల మేరకు పేర్లను నమోదు చేసుకుని, ఎప్పటికప్పుడు దానిని పునరుద్దరించుకోవాలని ఆయన సూచించారు. కార్మిక శాఖ భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడు సంవత్సరానికి 90 రోజులు నిర్మాణ పనుల్లో పనిచేయడం తప్పనిసరి అని కార్మిక అధికారి సిద్దప్ప ఖైనూర్ అన్నారు. బాలకార్మిక ప్రాజెక్టు డైరెక్టర్ మౌనేశ్ మాట్లాడుతూ 6 నుంచి 18 సంవత్సరాల మధ్యవయస్సున్న బాలకార్మికులను ఏపరిశ్రమలోనూ నియమించరాదని ఆదేశించారు. పనిచేస్తున్నట్లు తేలితే వారిపై బాల కార్మిక చట్టం కింద కేసు నమోదు చేస్తామన్నారు. లేబర్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్, భవన నిర్మాణ కార్మిక బోర్డు అసంఘటిత బోర్డు ప్రాజెక్టుల గురించి అవగాహనకల్పించారు. కుమరస్వామి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

● కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



బళ్లారి సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో జిల్లాలో వేడి వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, ప్రజలు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ చైర్మన్, కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ అన్నారు. ఎండలు రోజు రోజుకు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దాహం వేయకపోయినా నీరు పుష్కలంగా తాగాలని, ఎక్కువగా కాటన్ దుస్తులను వేసుకోవాలన్నారు. ఎండలో బయటకు వెళ్లే సమయంలో గొడుగు, టోపీ, బూట్లు లేదా చెప్పులు వాడాలన్నారు. తల, మెడ ముఖం అవయవాలకు తడిగుడ్డతో శరీరాన్ని చల్లబరచాలన్నారు. లస్సీ, షర్బత్, నిమ్మకాయనీరు, మజ్జిగ తదితర ఇంట్లో తయారుచేసిన పానీయాలనే తీసుకోవాలన్నారు. జంతువులకు, పక్షులకు నీటి తొట్టిలను ఏర్పాటు చేయాలని, వీలైనంత వరకు చల్లటి సమయాల్లో పనిచేయడం మంచిదన్నారు. ప్రజలకు ఏవైన సమస్యలు ఉంటే జిల్లా విపత్తు నిర్వహణ కేంద్రాన్ని 08392, 27710 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలపై

పుకార్లు పుట్టిస్తే చర్యలు

● కలెక్టర్ దివాకర్



విజయనగరం (హోస్పేట), మార్చి 19 (ఆంధ్ర జ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలపై తప్పుడు పుకార్లు పుట్టిస్తే కఠిన చర్యలు తప్పవని విజయనగర జిల్లా కలెక్టర్ దివాకర్ హెచ్చరించారు. ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. జిల్లా యంత్రాంగం, పాఠశాల విద్యాశాఖ నిర్వహించే వార్షిక పరీక్షల సన్నాహాలకు సంబంధించి నగరంలోని కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే ఎస్ఎస్ఎల్‌సీ వార్షిక పరీక్షలను ఎటువంటి వివాదాలకు తావులేకుండా కట్టుదిట్టంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో 340 పాఠశాలలు వుండగా, వాటిలో 120 ప్రభుత్వ పాఠశాలలు, 32 రెసిడెన్షియల్ పాఠశాలలు, 74 ఎయిడెడ్ పాఠశాలలు, 114 అన్ ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయన్నారు. మొత్తం 71 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ సారి వార్షిక పరీక్షకు 21,429 మంది కొత్త విద్యార్థులు, 1,271 మంది రిపీట్, ప్రైవేటు అభ్యర్థులు సహా మొత్తం 22,700 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. ఫలితాలను మెరుగుపరిచేదుకు పాఠశాలల్లో వివిధ కార్యకలాపాలు నిర్వహించామన్నారు.

ధర్మస్థల గ్రామాభివృద్ధి పథకాన్ని వినియోగించుకోండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కో ఆర్డినేటర్ రేఖ

కంప్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో శ్రీక్షేత్రం ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ కో ఆర్డినేటర్ రేఖ కోరారు. బుధవారం కొత్త నెల్లాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ట్యూషన్ క్లాస్ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యాప్రయోజనాల కోసం సంస్థ అనేక పథకాలు అమలు చేస్తోందని, ప్రతి విద్యార్థి వాటి గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు పరశురాం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పిల్లలకు ముఖ్యంగా గణితం, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్టులు కష్టమన్నారు. చదువులో వెనుకబడిన పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు శిక్షణ దోహదపడుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను సంస్థ కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మంజునాథ టీచర్ హనుమంతరెడ్డి, శివన్నగౌడ, రామప్ప సుఖరాజ్, శివ నాగప్ప, కేఎం సరళ, గంగప్ప, ప్రియాంక యూనియన్ అధ్యక్షురాలు సరోజసేవా ప్రతినిధి రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

అపరిశుభ్రతను తొలగించండి



నీటి తొట్టె చుట్టూ అపరిశుభ్రత

బళ్లారి సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సండూరుతాలూకాలోని కృష్ణనగర్ గ్రామంలో నీటి తొట్టె చుట్టూ మురుగునీరు పేరుకుపోయి ఆ ప్రదేశం దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. రైతులు తమ పశువులు, దూడలను ట్యాంకు వద్దకు నీటిని తాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. మహిళలు నీటిని తెచ్చుకునేందుకు అవస్థలు పడతుఉన్నారు. తొట్టె చుట్టూ ఉన్న అపరిశుభ్రతను తొలగించాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి చెన్నబసయ్యస్వామి కోరారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

రాయచూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవహాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందన సంఘటన నగరంలోని స్టేషన్ రహదారిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడు ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన సురేశ్ కుమార్(38)గా గుర్తించారు. బైక్‌పై వెళుతున్న సురేశ్ కుమార్ స్టేషన్ నుంచి మంత్రాలయం రోడ్డు వైపు వెళుతుండగా వెనక నుంచి వస్తున్న లారీ ఆయనను ఢీకొంది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

సిరుగుప్ప, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలో దేవలాపురం గ్రామం వద్దనున్న ఆదర్శ విశ్వ విద్యాలయంలో రెండు విద్యార్థుల గ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పది మందికిపైగా విద్యార్థులు ఒక విద్యార్థికి మధ్య తోపులాట జరిగింది. ఒకరికొకరు ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో గురుసిద్దయ్య అనే అధ్యాపకుడు, ముఖ్య ఉపాధ్యాయుడు కావాలనే రెండు గ్రూపుల మధ్య వాగ్వాదానికి కారకులయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖాధికారి గుర్రప్పకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారులకు తెలిపి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



ఓ విద్యార్థిని తోస్తున్న ఇతర విద్యార్థులు

హోసూరు జోన్

అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్



పనుల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు(కృష్ణగిరి), మార్చి 19(ఆంధ్రజ్యోతి): 'మీ ఊరిలో మీ కోసం ప్రాజెక్టు' పథకం కింద జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కలెక్టర్ దినేశ్‌కుమార్ స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య నిర్మాణ పనులు, ఎగువ రిజర్వాయర్ ట్యాంక్, పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల, శూలగిరి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమండొడ్డి పంచాయతీ అగ్రిబిజినెస్ అండ్ సేల్స్‌ప్రైమరీ ప్రాసెసింగ్ ప్లాంట్, బేరికై పంచాయతీ, కృష్ణగిరిలోని జిల్లా శూలగిరి ఇంటిగ్రేటెడ్ షెల్లింగ్ రూమ్ తదితర పనులను పరిశీలించారు. కలెక్టర్‌తోపాటు జిల్లాస్థాయి ఇతర ఉన్నతాధికారులు ఎంపిక చేసిన సర్కిల్‌లో ఉదయం 9 నుంచి మరుసటి రోజు 9 గంటల వరకు ఉండి వివిధ ప్రభుత్వ శాఖల అమలు చేస్తున్న ప్రాజెక్టులు, సేవలు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు పాటించారు. బుధవారం ఉదయం 15వ ఫైనాన్స్ కమిటీ మంజూరు పథకం క్రింద రూ.40లక్షలతో పూర్తి చేసిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులను, జిల్లా శూలగిరి పంచాయతీ సభ్యురాలు శూలగిరి పంచాయతీ ఎఫ్‌క్కినయ్యపల్లిలో రూ.16.55 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణ పనులను పరిశీలించారు. దెబ్బతిన్న ఓవర్ హెడ్‌రిజర్వాయర్ ట్యాంకు మరమ్మత్తు పనులను నివాస ప్రాంతాలకు తాగునీటి సరఫరా పనులను పరిశీలించారు. తనిఖీలో జిల్లా ఎస్పీ పి.తంగదురై, జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కవిత, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, ప్రాజెక్ట్ డైరెక్టర్ పెరియస్వామి, గ్రామీణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, యూనియన్ల జోనల్ లైజన్ డైరెక్టర్ నటరాజన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుపై శిక్షణ



వర్మీకంపోస్టుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

హోసూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వర్మీకంపోస్టు తయారీపై హోసూరు మండల రైతులకు విద్యాయాత్ర నిర్వహించారు. కృష్ణగిరి జిల్లా హోసూరు ప్రాంతంలో వ్యవసాయ శాఖ రాష్ట్ర విస్తరణ పథకాల సహాయ పునరావాస కార్యక్రమం క్రింద చొక్కనాథపురం, కొత్తపల్లి, సేవగానపల్లి గ్రామాలకు చెందిన 50 మంది రైతులకు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు హోసూరు ఆధ్వర్యంలో వ్యవసాయ విజ్ఞాకేంద్రంలో వానపాములతో ఎరువు తయారీ విధానంపై అవగాహన కల్పించారు. డాక్టర్ సెందిల్‌కుమార్ మాట్లాడుతూ వానపాము రైతుకు ప్రకృతి కల్పించిన వరమన్నారు. భూమిలో సహజంగా లభించే వ్యవసాయ వ్యర్థాలను వానపాముల ద్వారా పేడతో ఎరువుగా తయారు చేయడం ద్వారా లభించే కంపోస్టు వర్మీకంపోస్టు అన్నారు. ఈ ఎరువు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వర్మీకంపోస్టు తయారీకి సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఆత్మ రీజినల్ టెక్నికల్ మేనేజర్ సుగుణ, అసిస్టెంట్ మేనేజర్ షణ్ముగం నిర్వహించారు.

మహిళలకు భద్రత కరువు



మాట్లాడుతున్న సీపీఎం నేత వాసుకి

హోసూరూ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ హయాంలో మహిళలకు భద్రతకు కరువు ఏర్పడిందని సీపీఎం సదస్సులో కేంద్ర కమిటీ సభ్యురాలు వాసుకి అన్నారు. హోసూరులో జరిగిన సదస్సులో నాగరాజు రెడ్డి, కార్యదర్శి జయరామన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఢిల్లీ బాబు, జిల్లా కార్యదర్శి సరేశ్, కేంద్ర కమిటీ సభ్యుడు వాసుకి కీలక ప్రసంగం చేశారు. సమావేశంలో వాసుకి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం, వ్యవసాయం, ఇతర అన్ని రంగాలలో మహిళలు ముందంజలో ఉన్నారన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో మహిళలు ఇప్పుడిప్పు బానిసత్వం పోయి స్వావలబన దిశగా క్రమేపీ రాణిస్తున్నారన్నారు. మహిళల సెల్‌ఫోన్, కంప్యూటర్ ఉండకూడదని, బాయ్‌ఫ్రెండ్స్‌ను పెళ్లి చేసుకోవాలని పంచాయితీ చేస్తారన్నారు. పురుషుల ఆధిపత్యం అక్కడక్కడా కొనసాగుతోందన్నారు. అలాగే కొన్ని గ్రామాల్లో కూడా కులపంచాయితీలదే పెత్తనంగా ఉంటుందన్నారు. సదస్సులో పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

మద్దూరి అన్నపూర్ణయ్య (జయంతి)



'ఆంధ్రా నేతాజీ'గా సుప్రసిద్ధులైన మద్దూరి అన్నపూర్ణయ్య 1899 మార్చి 20న తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం తాలూకా కొమరగిరిలో జన్మించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, పాత్రికేయులు. కాంగ్రెస్, నవశక్తి, జయభారత్, వెలుగు పత్రికలు నడిపి స్వాతంత్ర్యానికి ముందూ, తర్వాత కూడా 'కలం ఖడ్గాన్ని' విశృంఖలంగా ప్రయోగించిన నిస్వార్థ పాత్రికేయుడు. దేశంకోసం 55ఏళ్ల దీక్షగా శ్రమించి 11ఏళ్ల పాటు జైలులో గడిపిన మహా త్యాగి. స్వాతంత్ర్యం రాగానే జాడ లేని మహోన్నత నాయకుడిలలో ఒకరు. 1954 సెప్టెంబరు 11న కన్నుమూశారు.

శోభన్‌బాబు (వర్ధంతి)



వెండితెరపై 'సోగ్గాడు'గా పేరొందిన శోభన్‌బాబు 1937 జనవరి 14న కృష్ణా జిల్లా నందిగామలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. అసలు పేరు ఉప్పు శోభనా చలపతి రావు. ప్రేక్షకుల ఆదరాభిమానాలు చూరగొన్న తెలుగు సినిమా కథానాయకుడు. కుటుంబ కథాభరిత చిత్రాలలో ఉదాత్తమైన వ్యక్తిత్వం కలిగిన పాత్రలలో రాణించారు. ఆంధ్రుల అందాల నటుడిగా తెలుగువారి మదిలో నిలిచారు. నటభూషణ బిరుదులు పొందారు. 220కుపైగా సినిమాలలో నటించి 59వ యేట నటజీవితానికి స్వస్తి పలికారు. సినీ రంగంలో ఉన్నా క్రమశిక్షణతో కూడిన జీవితానికి మారుపేరుగా నిలిచారు. 2008 మార్చి 20న కన్నుమూశారు.

అల్కా యాగ్నిక్ (పుట్టినరోజు)



అల్కా యాగ్నిక్ 1966 మార్చి 20న కోల్కత్తాలో జన్మించారు. గుజరాతీ కుటుంబానికి చెందిన ఆమె నేపథ్యగాయనిగా రెండు సార్లు జాతీయ పురస్కారం అందుకున్నారు. నాలుగు దశాబ్దాలలో ఉత్తమ గాయనిగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారానికి 36 సార్లు నామినేట్ అయి ఏడుసార్లు పొందారు. 20 భాషలలో వెయ్యికిపైగా సినిమాలలో 20వేలకుపైగా పాటలు పాడారు. అభిమానులు ఆమెను 'ది క్వీన్ ఆఫ్ ప్లేబ్యాక్ సింగింగ్'గా పిలుస్తుంటారు. యూట్యూబ్‌లో మ్యూజిక్ చార్ట్స్ అండ్ ఇన్‌సైట్‌లో టాప్ గ్లోబల్ ఆర్టిస్ట్ జాబితాలో 2024 జూన్‌లో నెంబరు వన్ ర్యాంకులో నిలిచి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు పొందారు.

నేతల జయంతిని సమర్థవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి నితీశ్

రాయచూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 5వ తేదీన మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రాం, 14న భారత రత్న అంబేడ్కర్ జయంతులను కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లాధికారి నితీశ్ ఆదేశించారు. బాబుజీ, బాబా సాహెబ్ జయంతి కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి బుధవారం నగరంలోని మినీ విధాన సౌధ కార్యాలయంలో పూర్వసిద్ధత సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇద్దరు మహనీయుల జయంతి కార్యక్రమాలను ప్రభుత్వపరంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. స్థానిక పండిత్ సిద్ధరామ్ జంబలదిన్ని రంగమందిరంలో నిర్వహించే కార్యక్రమాల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదన్నారు.

చెరువులను నింపాలి



అధికారులకు సూచనలిస్తున్న జడ్పీ సీఈఓ

రాయచూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని చెరువులను నీటితో నింపాలని జడ్పీ సీఈఓ రాహుకారాం పాండ్వే ఆదేశించారు. జిల్లాలోని దేవదుర్గ తాలూకా నాగడదిన్ని గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి కోసం ఉద్దేశించిన బంగారప్ప చెరువును బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా కాలువల ద్వారా వచ్చే నీటితో వెంటనే అన్ని చెరువులను 100 శాతం భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. 94,95,96,99 డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో ఇప్పటికే తుంగభద్ర ప్రధాన ఎడమకాలువ నుంచి నీటిని విడుదల చేసిన నేపథ్యంలో నాగడదిన్ని చుట్టుపక్కన ఉన్న 8 గ్రామాల్లో అన్ని తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలన్నారు.

రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టండి

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

అనంతపురం టౌన్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రతి అధికారి ప్రత్యేక దృష్టిపెట్టి, పరిష్కరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. జేసీ శివనారాయణ శర్మతో కలిసి ఆయన బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలపై ఎప్పటికపుడు విశ్లేషించుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల25, 26 తేదీల్లో ముఖ్యమంత్రి కలెక్టర్ల సదస్సు ఉంటుందనీ, ప్రభుత్వ పథకాలకు సంబంధించి పక్కా సమాచారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, ఆర్డీఓలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పాతబాగేపల్లిలో మౌలిక సదుపాయాలు కరువు

బాగేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బాగేపల్లి పట్టణానికి అనుబంధమైన ఘంటమవారపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పాతబాగేపల్లిలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ప్రధానంగా తాగునీరు, రోడ్డు, డ్రైనేజీ సదుపాయాలు లేక ప్రజలు సతమతమవుతున్నారు. శుద్ధతాగునీటి కేంద్రం ఉన్నప్పటికీ అది ఆరు నెలలుగా పనిచేయడం లేదు. దీంతో తాగునీటికోసం మూడు నాలుగు కిలోమీటర్ల మేర వెళ్లాల్సి వస్తోంది. మినరల్ వాటర్‌ను అందుబాటులోకి తెచ్చామని గొప్పలు చెప్పుకోవడమేగానీ సదరు వాటర్ ప్లాంట్ నెలల తరబడి పనిచేయడం లేదని పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో మురుగునీరు వెళ్లేందుకు సరైన కాలువ వ్యవస్థ లేదు. ఉన్న కాలువలలో కూడా పూడిక తీయకపోవడంతో దుర్గంధం నెలకొంది. మరోవైపు దోమల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎండాకాలం కాబట్టి సరే వర్షాలు కురిస్తే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందంటున్నారు.

కంకర తేలిన మట్టి రోడ్డు

గ్రామానికి సరైన ప్రజారవాణా వ్యవస్థ లేదు. దీంతో ప్రజలు ప్రైవేట్ వాహనాల ద్వారానే పట్టణానికి చేరుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న మట్టి



ఆరు నెలలుగా పనిచేయని శుద్ధ తాగునీటి కేంద్రం



ధ్వంసమైన మురుగునీటి కాలువ

రోడ్డు కంకరతేలి ఉండడమే కాక అక్కడక్కడా పెద్ద గుంతలు ఉన్నాయి. ఈ మార్గంలో ప్రయాణం ఒక సవాల్‌గా ఉందని, అత్యవసరమై ఒకవేళ అంబులెన్స్ రావాలన్నా కూడా వారు సైతం ఈ మార్గంలో వచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నారని గ్రామస్థులు అంటున్నారు. ప్రతిరోజూ పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

త్వరలోనే మరమ్మతులు: ఈఓ

తాలూకా పంచాయతీ ఈఓ జీవీ రమేశ్ స్పందిస్తూ పాతబాగేపల్లిలోని శుద్ధ తాగునీటి కేంద్రం మరమ్మత్తుకు గురైనట్టు సమాచారం ఉందన్నారు. వెంటనే బాగు చేయాలని సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులకు సూచించామన్నారు. నీటి సమస్యను అత్యవసరంగా పరిగణించి పరిష్కరించాలని ఆదేశించామన్నారు. కాగా రోడ్డు, డ్రైనేజీ పనులను నరేగా ఇతర పథకాల కింద చేపడతామన్నారు. కాగా గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు రఘురామరెడ్డి మాట్లాడుతూ తాను పంచాయతీ సభ్యుడిగా ఉన్నప్పుడు గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. తాను ఓడిపోయాక సమస్యలను పరిష్కరించాలని పట్టించుకునేవారే కరువయ్యారన్నారు. వీటి గురించి తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారితోనూ చర్చించానని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు.

ఘనంగా మాడికెరె లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మారథోత్సవం

చింతామణి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మాడికెరె క్రాస్‌లో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో బ్రహ్మా రథోత్సవం, దీపోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. సుప్రభాత సేవ, స్వామివారికి పంచామృతాభిషేకం, కళశారాధన, హోమం, బలిహరణ, కాశీయాత్ర మహోత్సవం, అనంతరం స్వామివారి కల్యాణోత్సవం, గరుడోత్సవం, మహామంగళారతి, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలు జరిగాయి. చింతామణి పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాలైన మడికెరె, ఊలవాడి, కురుటహళ్ళి, దొడ్డగంజూరు, బూరగమాకలహళ్ళి, ఐమరెడ్డిహళ్ళి, చీమనహళ్ళి తదితర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు పానకం, పెసరపప్పు పంపిణీతోపాటు అన్నదాసోహం నిర్వహించారు. డప్పు వాద్య కళాబృందాలు, కోలాటం, భజన బృందాలు రథోత్సవానికి మరింత శోభనిచ్చాయి. ఆలయ ధర్మకర్తల కుటుంబీకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చింతామణి రూరల్ పోలీసులు బందోబస్తు కల్పించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రొఫెసర్ నవీన్ కుమార్‌కు పురస్కారం



గవర్నర్ నుంచి పురస్కారం అందుకుంటున్న ప్రొఫెసర్ నవీన్‌కుమార్

శిడ్లఘట్ట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 2022-23 సంవత్సరానికి ఎన్ఎస్ఎస్‌లో ఉత్తమ సేవలందించిన ప్రొఫెసర్ నవీన్‌కుమార్ కేఎస్‌కు రాష్ట్ర అత్యుత్తమ ఎన్ఎస్ఎస్ అధికారి పురస్కారం వరించింది. యువ జను లు, క్రీడలశాఖ ఏటా ఇచ్చే ఎన్ఎస్ఎస్ రాష్ట్రస్థాయి అత్యుత్తమ పురస్కారాలకు యలహంక ఉపనగరలోని శేషాద్రిపురం ఫస్ట్‌గ్రేడ్ కళాశాల, రాష్ట్ర అత్యుత్తమ ఎన్ఎస్ఎస్ పురస్కారానికి చిక్కబళ్ళాపుర తాలూకా కేశవార గ్రామానికి చెందిన ప్రొఫెసర్ నవీన్‌కుమార్‌కు దక్కింది. అత్యుత్తమ విభాగ పురస్కారాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎన్ వెంకటేశ్ అందుకున్నారు. బెంగళూరు రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ నుంచి పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్ మాట్లాడుతూ అత్యుత్తమ ఎన్ఎస్ఎస్ విభాగం పురస్కారం అందుకోవడానికి ప్రొఫెసర్ నవీన్, ఆయన బృందం కృషి ఎంతో ఉందన్నారు. వారికి తన హృదయపూర్వక అభినందనలన్నారు. ప్రొఫెసర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఈ సాధనకు ఎన్ఎస్ఎస్ స్వయంసేవకుల సమిష్టి కృషియే కారణమన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది అందరి సహకారంతోనే సాధ్యమైందన్నారు. ప్రొఫెసర్ నవీన్‌కుమార్‌కు ఉత్తమ పురస్కారం లభించడంపై కేశవార గ్రామ స్థులు హర్షం వ్యక్తం చేశారు.

జానపద కళలను భావితరాలకు అందించాలి

ముళబాగిలు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జానపదం అనేది మన సంస్కృతిలో భాగమని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని కర్ణాటక జానపద అకాడమీ పురస్కార గ్రహీత డీఆర్ రాజప్ప అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో 'మన సంస్కృతి మనకు గొప్ప' అనే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జానపద సాహిత్యం, కళలు, సంప్రదాయాలను మనం పాటిస్తూ భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. జానపద కళలకు సరైన ప్రోత్సాహం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి ముని వెంకటప్ప మాట్లాడుతూ గతంలో రాజులు, చక్రవర్తులు జానపద కళలను ప్రోత్సహించేవారన్నారు. గతంలో పండుగల వేళ హరికథ, భజనలు కొనసాగేవని ప్రస్తుతం అవి తగ్గాయన్నారు. అయితే వాటిని కొనసాగించేలా వివిధ స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరించాలని అభిప్రాయపడ్డారు. బీజమాత పావమ్మ మాట్లాడుతూ విద్యార్థులలో జానపద సాహిత్యంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. జానపద సాహిత్యం తనదైన ప్రాధాన్యతను కలిగి ఉందన్నారు. ఈ సందర్భంగా జానపద కళాకారుడు డీఆర్ రాజప్ప ఆలపించిన జానపద గీతాలు సభికులను అలరించాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ ముని వెంకటప్ప సహా తదితరుల డప్పు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు కోలాటం, డప్పు ప్రదర్శనలు చేశారు. అధ్యాపకులు ఆదినారాయణ, శివరామేగౌడ, టిఎన్ శ్రీనివాస్, ఎంఎన్ మూర్తి, మోహన్‌రెడ్డి, శీనప్ప తదితరులు పాల్గొన్నారు.



జానపద కళాకారుడు రాజప్ప తదితరులు

నేరాల నియంత్రణపై అవగాహన



కరపత్రాల పంపిణీలో సీఐ దయానంద్ తదితరులు

బంగారపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవలికాలంలో నేరాలు పెరిగాయని వాటి నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఫోకస్ సంస్థ అధ్యక్షుడు అ.నా హరీశ్ అభిప్రాయపడ్డారు. పోలీసుల సహకారంతో నేరాల నియంత్రణకు సంబంధించి జాగృతి కల్పించేలా వీధినాటకాన్ని బుధవారం ప్రదర్శించారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ దయానంద్ మాట్లాడుతూ కేజీఎఫ్ జిల్లా ఎస్పీ మార్గదర్శకాలకు అనుగుణంగా బహిరంగస్థలాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ రాజణ్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురాణ పఠనం ప్రారంభం

సిరుగుప్ప, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని టెక్కలకోటలో కాడసిద్దేశ్వర స్వాముల పురాణపఠనం ప్రారంభమైంది. హాళేకోట మల్లికార్జునస్వామి ఆధ్వర్యంలో పురాణ పఠనానికి శ్రీకారం చుట్టారు. 30వ తేదీ వరకు సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. సంగీత కళాకారులు భక్తి గానలహరి, వేదపండితులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.



పురాణ పఠనంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకుడు

ఇంటి స్థలాల కోసం ఏఐకేఎస్ నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

బాగేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ అఖిల భారత కిసాన్ సంఘం (ఏఐకేఎస్) డిమాండ్ చేసింది. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఏఐకేఎస్ తాలూకా సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర సంచాలకులు కేవీ రామచంద్రరావు మాట్లాడుతూ బాగేపల్లి నియోజకవర్గం అత్యంత వెనుకబడినదని, మౌలిక సదుపాయాల కొరత ఉందన్నారు. కనీస సదుపాయాలను పరిష్కరించడంలో తాలూకా యంత్రాంగం జాప్యం చేయడమే కాక పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పథకాల నిధులు సద్వినియోగం కావడం లేదని ఆరోపించారు. భూమాఫియాకు రెవెన్యూ శాఖలోని కొంతమంది సహకారం అందిస్తున్నారన్నారు. పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల పేదలకు ఇళ్లస్థలాలను కేటాయించడంలో జాప్యం జరుగుతోందన్నారు. పాత బాగేపల్లి సర్వే 102లో 72 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. పట్టణంలో బాడుగ ఇళ్లల్లో ఉంటున్న పేదలకు సదరు స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్ గతంలోనే సూచించినా అమలు కావడం లేదన్నారు. రైతుసంఘం ద్వారా 500మందికిపైగా ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. 1409 మంది ఇంటి స్థలాల గురించి తహసీల్దారుకు విన్నవించారన్నారు. అయినా స్థలాల పంపిణీలో జాప్యం జరుగుతోందని, పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇదే రీతిన నిర్లక్ష్యం కొనసాగితే ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తరపున ఆర్ఐ మంజునాథ్ వినతిపత్రాన్ని స్వీకరించి మాట్లాడుతూ సుమారు 25 ఎకరాలను గుర్తించి పురసభకు ఇచ్చామని, త్వరలోనే ఇంటి స్థలాలు ఇచ్చేందుకు జాబితా సిద్ధమైందని పరిశీలన జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా నిరసనలో ఏఐకేఎస్ తాలూకా అధ్యక్షుడు రామరెడ్డి, కార్యదర్శి ఆదిశేషు, మార్కెట్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎం చలపతి, సభ్యురాలు ప్రమీళ, టీయూసీఐ తాలూకా అధ్యక్షుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



ప్రసంగిస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్ మోహన్‌కుమార్

శిడ్లఘట్ట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులు, నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నారని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా గుణాత్మక విద్య అందుతోందని కావున పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇన్‌చార్జ్ కమిషనర్ మోహన్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇటీవలి ప్రభుత్వ పాఠశాలలు మూతపడే సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు మాదిరిగా తీర్చడంలో ఉపాధ్యాయుల పాత్రతోపాటు తల్లిదండ్రుల సహకారమన్నారు. ప్రస్తుత పోటీయుగంలో పాఠాలతోపాటు పాఠ్యేతర అంశాలు అంటే క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ (ఎస్‌డీఎంసీ)లు కూడా పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే తప్పకుండా రాణిస్తారన్నారు. అందుకు మనం తగిన చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థులు మనసు పెడితే ఇలాంటి కార్యక్రమాలు మరింత ఘనంగా నిర్వహించడం సాధ్యమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో సీఆర్‌పీ బాబు, ఎస్‌డీఎంసీ ఉపాధ్యక్షురాలు మంజుళమ్మ, నగరసభ సభ్యుడు కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు మొహ్మద్ హాసేన్, ఉపాధ్యాయులు నగీనా, అనుజా తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరత కోసం ఐపంప్ నెట్‌తో ఒప్పందం

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో పంపింగ్ సిస్టమ్ ఆప్టిమైజేషన్‌లో ప్రముఖంగా పేరొందిన పంప్ అకాడమీ సంస్థ సుస్థిరతకోసం ఐపంప్‌నెట్‌తో ఒప్పందం చేసుకుంది. రెండు సంస్థలు సుదీర్ఘకాలంగా ప్రజల మన్ననలు పొందేలా సేవలందిస్తున్నట్టు పంప్ అకాడమీ ఫౌండర్ ఛైర్మన్ అనిల్ సేథి ప్రకటించారు. ఐపంప్‌నెట్ సంస్థ బెంగళూరు జలమండలి, ముంబై మునిసిపల్ కార్పొరేషన్‌తోపాటు పలు ప్రముఖ సంస్థల కార్యాచరణ కొనసాగిస్తోందన్నారు. ఏఐ, ఐఓటీ సాంకేతిక ఆధారంగా పనిచేస్తుందన్నారు.

చేపలు చోరీ చేసిందని చెట్టుకు కట్టేసి మహిళపై దాడి

బెంగళూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): చేపలు చోరీ చేశారని ఓ మహిళను చెట్టుకు కట్టేసి చితకబాదిన సంఘటన ఉడుపి తాలూకా మల్పె బీచ్‌లో చోటు చేసుకుంది. మల్పె ఓడరేవులో అమానుష సంఘటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చెట్టుకు కట్టేసి మహిళపై దాడి చేశారు. వందలాదిమంది గుంపుగా చేరినా ఎవరూ ఆమెను రక్షించలేదు. ఈనెల 16న సంఘటన చోటు చేసుకోగా సోషల్ మీడియాలో బుధవారం వీడియోలు వైరల్ అయ్యాయి. ఇద్దరు మహిళలు మల్పె బీచ్‌కు చేపలు చోరీ చేసేందుకు వచ్చారని గుర్తించిన స్థానికులు దాడి చేశారు. ఈమేరకు వీడియోలు వైరల్ కావడంతో మల్పె పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. లక్ష్మీబాయి, సుందర్, శిల్పలతోపాటు మరొకరిని అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ అరుణ్ తెలిపారు. కాగా చెట్టుకు కట్టేసి మహిళపై దాడిని సీఎం సిద్దరామయ్య తీవ్రంగా ఖండించారు. సంఘటన ఏదైనా ఇదో అమానుషమన్నారు. తీవ్రమైన నేరంగా పరిగణించాలన్నారు. చేపలు చోరీ జరిగి ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చునని, కానీ చట్టాన్ని ఉల్లంఘించేలా వ్యవహరించడం సరికాదన్నారు.

అత్యాచార కేసులో యువకుడికి జీవితఖైదు

చింతామణి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీ రోడ్డు స్పిరిట్ అండ్ వైన్స్ షాప్ సమీపాన నిద్రిస్తున్న 70ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి జీవితఖైదు విధించారు. రెండో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయాధికారి బుధవారం తీర్పును ప్రకటించారు. నిందితుడికి జీవితఖైదు, రూ.50వేల జరిమానా విధించారు. 2021 అక్టోబరు 25న వృద్ధురాలిపై చిక్కబళ్ళాపుర జిల్లా గుడిబండ సమీపాన చిన్నగానహళ్ళికి చెందిన నాగరాజు అలియాస్ రాజు (26) అత్యాచారానికి పాల్పడ్డాడు. కేసులో చార్జ్‌షీట్ దాఖలు అనంతరం వాదోపవాదాలు సాగి చివరకు తీర్పు వెలువరించారు.

ఎస్ఎస్ఎల్సీ పరీక్షల నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

తోరణగల్లు, మార్చి 19(ఆంధ్ర జ్యోతి): తాలుకా కచేరి సభలో 2024-25 ఎస్ఎస్ఎల్సీ పరీక్ష పూర్వపరాల సిద్ధత సభ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. శుక్రవారం నుంచి ఎస్ఎస్ఎల్సీ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, కర్ణాటక పరీక్ష మండలి తెలిపిన 32 పుటాల మార్గ సూచనలను తెలుపుతూ వ్యవస్థాపరంగా ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. అలాగే విద్యార్థులకు పరీక్ష కేంద్రాలలో అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. సీసీటీవీలను ఏర్పాటు చేయాలని, రాత్రి సెక్యూరిటీ గురించి చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయుడు కొట్రేష్, క్షేత్ర శిక్షణాధికారులు ఎస్ఎస్ఎల్సీ పరీక్ష సహాయకులు పాల్గొన్నారు.